# నీడ

**వీధి తలుపు చప్పుడైతే వంటింట్లో ఏదోపనిలో వున్న సునీత గబగబావెళ్లి తలుపు తీసింది. ఎదురుగా పక్కింటి వనజ!**

"సునీతా! అటు చూడు" వీధి అరుగువైపు చూపిస్తూ అంది వనజ.

ఏమిటన్నట్టు చూసింది సునీత.

"అదెవర్తో అరగంటయింది, ఇక్కడే కూర్చుంది. ముష్టికోసం రాలేదంట. దానికి పని కావాలిట. 'ఎక్కడైనా పని వుంటే ఇప్పించండమ్మా చేస్తాను. నాకు వూరికే డబ్బు వొద్దు' అంది. మీకు పని మనిషి లేదు కదా. దాన్ని పన్లో పెట్టుకుంటారేమోనని..."

సునీత అరుగు మీద కొచ్చింది. "ఏయ్ ఎవర్నువ్వు? ఇలారా. ఎక్కడ్నుంచివచ్చావు? నీది ఈ వూరేనా?"

అది లేచివచ్చి సునీతకి దండం పెట్టింది. "అమ్మా! నేను ఎల్లమ్మ కూతుర్నండీ. నన్ను రంగి అంటారండి. మాయమ్మ సచ్చిపోనాదండి. ఉన్న వొక్క తమ్ముడూ నన్నొదిలి ఎక్కడికో పారిపోయాడండి. నాకు వుంటానికి ఇల్లుకూడా నేదండి. ఏటి సెయ్యాలో తెలీక ఎవరైనా పనిప్పిస్తారేమోనని వచ్చానండి" అంది దీనంగా.

"అయ్యోపాపం. ఎల్లమ్మ చచ్చి పోయిందా? అయితే ఇప్పుడు నీకు ఎవ్వరూ లేరన్నమాట." ఎల్లమ్మ ముగ్గు అమ్ముతూ వుండేది. తన కష్ట సుఖాలన్నీ ఏకరువు పెట్టేది ఎప్పుడొచ్చినా.

సునీతకి చాలా జాలివేసింది రంగిని చూస్తే. ఆమె వంక పరీక్షగా చూసింది. పదిహేడు, పద్దెనిమిదేళ్ల కంటే ఎక్కువుండవు. అప్పుడే వికసించిన పువ్వులాంటి ఆడపిల్ల ఈ సమాజంలో బతకడానికి ఇంత నీడ కావాలని కోరుకుంటోంది. కాని ఈ సమాజంలో వున్న ద్విపాద పశువులు, నర రూప రాక్షసులు దానిని సవ్యంగా బ్రతక నిస్తారా? చామన చాయ, కళ్ళూ, ముక్కూ తీరుగా వున్నాయి. వంకీల జుట్టు మొత్తం మీద చక్కదనమే. చీరా, జాకెట్‌లలో చిన్నచిన్న చిరుగులున్నాయి. అంతా కలిపి ఆడవాళ్లకి జాలికలిగినా మొగవాళ్లకి ఆకర్షణ కలిగే తీరుతుంది. జాలిగొలిపే చూపులతో ఒదిగొదిగి నుంచుంది.

ఒక్క నిముషం నిశితంగా దాని వైపు చూస్తూ "పని సంగతి తర్వాత చూద్దాం. అన్నం వుంది పెడతాను తింటావా" అంది సునీత. మధ్యాహ్నం చాలా అన్నం మిగిలిపోయింది. పోనీ పెట్టిద్దామంటే పని మనిషి కూడా లేదు. మధ్యాహ్నం అన్నం రాత్రికి తినరు ఇంట్లో. పారెయ్యడం ఇష్టం లేదు. సరిగ్గా సమయానికి అది కనిపించింది.

తింటానన్నట్టుగా తలూపింది రంగి.

సునీత వంటింట్లోకెళ్ళి మిగిలిపోయిన అన్నం, కూర, పచ్చడి ఒక ఆకులో వేసి తెచ్చి పెట్టింది.

ఎంత ఆకలితో వుందో ఏమో, రంగి ఆబగా అన్నం తింటోంది. విపరీతమైన సానుభూతి కలిగింది సునీతకి.

"ఇది ముష్టిదికాదు. కష్టపడి పని చేస్తానంటోంది. ఒళ్ళమ్ముకోడానికి బయల్దేరలేదు. ఒళ్ళొంచి పనిచేసి కడుపు నింపుకోడానికి వచ్చింది. మంచి దానిలాగే వుంది. ఒంటరిగా ఈ సమాజంలో నిలవగలదా? వయసులో వున్న పిల్ల. మగాళ్ళ నుండి తన్నుతాను రక్షించుకోగలదా? లేక ఎక్కడో ఏ బలహీన క్షణంలోనో మొగవాడికి లొంగిపోతే ఆ తర్వాత దాని జీవితం కుక్కలు చింపిన విస్తరి అయిపోతుందేమో? ఇదే మగాడైతే రాత్రుళ్ళు ఏ అరుగు మీద దొర్లినా ఏం ఫర్వాలేదు. కానీ ఆడబ్రతుకై పోయింది. దీన్ని ఎలాగైనా తను ఆదుకోవాలి, ఆశ్రయం ఇవ్వాలి. బ్రతకడానికి ఇంత నీడ నివ్వాలి. సామాజికస్పృహ గురించి ఉపన్యాసాలివ్వడం కాదు, ఇలాంటి దిక్కు లేని వాళ్ళని చేరదీసి ఇంత నీడ నిచ్చి బ్రతకడానికి అవకాశం కల్పించి ఆచరణలో పెట్టి చూపించాలి. లేక పోతే కోడిపిల్ల కోసం తిరిగితే గ్రద్దలు కాచుకున్నట్టు ఇది వీథుల్లో తిరిగితే దీని కోసం ఎంతమంది కీచకులు కాచుకునుంటారో - సమయం చూసి నలిపి నాశనం చెయ్యడానికి. భగవాన్! ఒక ఆడదానిగా ఈ భూమ్మీద పుట్టించడం, సరైన రక్షణ లేకుండా అలా వదిలేయడం ఇదంతా ఆడది చేసుకున్న పాపమా? లేక ఆడదానికి నువ్విచ్చే శాపమా? ఏ ఆడదాన్నయినా ఆమెకు ఇష్టం లేకుండా తాకితే మగాడు నాశనమై పోవాలని ఎందుకు శాపం ఇవ్వవు దేవుడా?... ఏమిటో పిచ్చి ఆలోచనలు. కాని ఎలాగైనా రంగిని పన్లో పెట్టుకుని ఇంత ఆశ్రయం కల్పిస్తేనే మంచిదని తోస్తోంది. ఆలోచిస్తూనే వంటింట్లో కెళ్ళి ఫ్రిజ్‌లో సీసాలోంచి చల్లటి మంచి నీళ్ళు స్టీలు చెంబులో పోసింది.

సునీత వెనకే లోపలికొచ్చిన గోపాలం ఆమెను చూస్తూ "ఏమిటీ హడావుడి... ఇందాక ఎవరికో అన్నం అవీ పట్టుకెళ్ళావు? ఇప్పుడు చల్లటి నీళ్ళు... బాగుంది... ఎవరికోయ్ ఇదంతా" అన్నాడు నవ్వుతూ.

జరిగింది చెప్తూనే మంచినీళ్ళతో వీథిలోకి వచ్చింది సునీత.

ఆమె వెనకే గోపాలం కూడా ఇవతలకి వచ్చాడు.

రంగికి చూడగానే గోపాలం కళ్ళు మెరవడం సునీత గమనించింది. మనసులో ఎక్కడో ముల్లుగుచ్చుకున్న భావన కలిగింది.

"అమ్మా పని వుంటే ఇప్పించండమ్మా. నమ్మకంగా చేసుకుంటూ మీ దగ్గరే పడుంటాను. ఎక్కడికీ వెళ్ళి పోకుండా ఇక్కడే వుండిపోతాను. నాకు అన్ని పనులూ వచ్చమ్మా" అది ప్రాధేయపూర్వకంగా అడుగుతోంది సునీతని.

వనజ పని ముగించుకుని ఇవతలకి వచ్చింది. "ఏమిటి ఇంకా వుందా ఇది? ఏమన్నావు? పన్లో పెట్టుకుంటున్నావా? మంచి పిల్లలాగే వుంది. వెనకాముందూ ఎవరూ లేరంటున్నది. ఇంటెడు పనీ చేయించుకోవచ్చు." అంది వనజ. వనజకి సునీత సంగతి బాగా తెలుసు.

ఒకసారి ఒక ముష్టివాడు వస్తే ఎగాదిగా చూసి "ఛ... ఛ... శుభ్రంగా దుక్కలా వున్నావు. నీకు కన్ను వంకరా? కాలు వంకరా? హాయిగా కష్టపడి ఏ పనైనా చేసుకోరాదూ. ఇలా ముష్టెత్తకపోతే" అని కసిరింది వాడ్ని.

పక్కనేవున్న వనజ "పోనీలెద్దూ వాడితో తగవెందుకు? మనకిష్టమైతే పిడికెడు బియ్యం వేస్తాం. లేకపోతే లేదని చెప్తాం. ఆ మాత్రం దానికి అంతలా క్లాసు తీసుకోవాలా?" అంది.

ఆమె మాటల్ని మధ్యలోనే ఆపేస్తూ "అది కాదు వనజా. నువ్వెన్ని చెప్పు. దేశంలోని దరిద్రమంతా ఈ ముష్టి వాళ్ళ మూలంగానే ఏర్పడుతోంది. సోమరిపోతు వెధవలు. ఒళ్ళు వంచి పనిచెయ్య లేక ఇలా ముష్టికి అలవాటు పడిపోతున్నారు. ముష్టి కూడా ఒక వ్యాపారమే. ఇలాంటి వాళ్ళను అస్సలు ఎంకరేజ్ చెయ్యకూడదు" అంది సునీత.

వనజ నవ్వింది ఆమె మాటలకి. "మనదేశంలోని ముఖ్యమైన సమస్యల్లో నిరుద్యోగ సమస్య ఒకటి. ప్రభుత్వం ఎన్ని ప్రణాళికలు చేసినా ఈ నిరుద్యోగ సమస్యని ఏమాత్రం దూరం చెయ్యలేక పోతోంది. డిగ్రీలున్న వాళ్ళకే ఉద్యోగాలు దొరక్కచస్తున్న ఈ దేశంలో ఇలాంటి వాళ్ళకి ఎవరిస్తారు ఉద్యోగాలు"

"ఉద్యోగం అంటే ఆఫీసులో కూర్చుని చేసేదే ఉద్యోగమనా నీ అభిప్రాయం? రిక్షా లాగినా, ఆటో నడిపినా, పాన్‌షాప్ పెట్టినా, బుక్‌షాప్ పెట్టినా, పేపర్లు పంచినా, టీకొట్టు పెట్టినా - ప్రతీదీ ఉద్యోగమే. అలాంటివి చేసుకోవచ్చు కదా."

"అలాంటి వాటికి కొంచెమైనా మదుపు వుండాలి. వాళ్ళని నమ్మి పెట్టుబడికి ఎవరిస్తారు అప్పు మాత్రం. మన సమాజంలో మనిషి మరో మనిషిని నమ్మకపోవడం అన్నది పెద్ద జబ్బయిపోయింది".

"అందుకే అన్నాను ముష్టి మదుపులేని వ్యాపారం అని. కానీ వనజా! నేను ఇలాంటి సోమరిపోతులను ప్రోత్సహించను. కాని అలాంటి వాళ్ళు కష్టపడి పనిచేస్తానంటే మాత్రం నాకుగాని అవకాశం వుంటే వాళ్ళకొక దారి చూపడానికి ప్రయత్నిస్తాను. మనం గుడి కెళ్ళి అర్చనలు, రుద్రాభిషేకాలు చేయిస్తే పుణ్యం రాదు. సమాజంలో మన చుట్టూ వున్న పేదవారిని, నిస్సహాయుల్ని చేరదీసి వీలైనంతలో మనకి తోచిన సహాయం చేస్తే అసలైన పుణ్యం వస్తుంది" అంది సునీత ఆవేశంగా.

అలాంటి సునీత రంగిని ఇంట్లో పెట్టుకోవడానికి ఇంకా ఆలోచిస్తున్నదంటే ఆశ్చర్యంగా వుంది వనజకి.

"ఏయ్ పిల్లా! నీ పేరేంటి?" అడిగాడు గోపాలం అతని ముఖంలో వింతకాంతి. మాటల్లో ఉత్సాహం.

రంగి తన పేరు చెప్పింది.

"ఈ అమ్మాయిని పన్లో పెట్టుకో సునీతా! నీకు అన్ని పనులకీ సాయంగా వుంటుంది. పని మనిషి లేక ఎంత ఇబ్బంది పడుతున్నావు నువ్వు. అడుక్కునే వాళ్ళని ఎంకరేజ్ చెయ్యకూడదు గాని, కష్టపడి పనిచేస్తానని ముందు కొచ్చే వాళ్ళని ప్రోత్సహించాలని అంటూ ఉంటావు కదా!"

గోపాలం ఆ మాటల్ని ఎంతో సానుభూతిగానే అన్నా సునీత మనసులో చిన్న బాధ కలిగింది. అంత వరకూ ఆ అమ్మాయిని ఎలాగైనా ఆదుకుని, ఆశ్రయం ఇచ్చి ఉద్ధరిద్దామని అనుకున్న ఆమె మనసులో ఆ ఆలోచన తప్పోముప్పో కావచ్చునని పించింది.

భర్త 'మగాడు'. సౌందర్యారాధన పేరుతో పర స్త్రీని కళ్ళతోనే తాగెయ్యడం తన జన్మహక్కుగా భావించగలడు. 'ఆడదంటే అలా వుండాలి. నువ్వూ వున్నావు. ఎందుకూ?' అని ఎవరినో చూపించి తన మనసుని ముక్కలు చేయగలిగిన భర్త. ఆడదై పుట్టినందుకు సర్దుకుపోవాలని పెద్దవాళ్ళు నేర్పిన పాఠం వల్ల నవ్వేసి వూరుకునేది సునీత.

"ఏమిటోయ్ ఇంకా ఆలోచిస్తున్నావు? ఆ అమ్మాయి నమ్మకస్తురాలిలాగే కనిపిస్తున్నది. ఇంత మంచి పనిపిల్ల మళ్ళీ నీకు దొరకదు. అయినా సామాజికస్పృహంటూ పెద్దకబుర్లు చెప్తావు. రంగిని పన్లో పెట్టుకోవడానికి ఇంత ఆలోచన దేనికి?..'' గర్వం కనిపించని ధోరణిలో చెప్తున్నాడు గోపాలం.

సునీత హృదయం భగ్గుమంటోంది. పొంగిపొరలే ఆగ్రహావేశాలని అణుచుకుంటూ తీక్షణంగా చూసింది భర్త వైపు.

ఆ అమ్మాయికి నీడనిచ్చి ఆమె జీవితం ముక్కలు చింపిన విస్తరి కాకుండా కాపాడాలని అనుకుంది. కాని రేపు ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు? రంగి ఇక్కడ ఇంట్లోనే కాకుండా తన జీవితంలోనే పర్మనెంట్‌గా సెటిల్ అయిపోతే... హమ్మో! 'ఆ పిల్లకి నీడనిచ్చిన పాపానికి రేపు తనకి నిలువనీడ లేకుండా పోతే!' భగవంతుడా! వద్దు. వద్దు. తన సంసారం నాశనం కావడానికి దారితీసే సామాజికస్పృహ తనకొద్దు.

ఇలాంటి భర్తల్ని పొందిన తనలాంటి ఆడవాళ్ళు జీవితంలోని ప్రతీ అడుగూ ఎంతో జాగ్రత్తగా ఆలోచించి వెయ్యాలి. ఒక స్థిరనిశ్చయానికొచ్చిన దాన్లా "ఈ అమ్మాయిని నేను పన్లో పెట్టుకోవడం లేదు. ఈ విషయంలో డిస్కషన్ వద్దు.'' అంది భర్తతో.

"పాపం! ఆ అమ్మాయి ఎక్కడికెళ్తుందో ఏమిటో. అనవసరంగా పంపించేస్తున్నావు. పెద్ద కబుర్లు చెప్తావు. గాని పన్లో పెట్టుకోవడానికి దాన్ని నమ్మలేకపోయావు.''

"నేను వద్దన్నది ఆ అమ్మాయి మీద నమ్మకం లేక కాదు.'' గొణుక్కుంది సునీత అస్పష్టంగా.

"నువ్వు ఇంకెక్కడికైనా వెళ్ళు. ఇక్కడ నీకేం పని దొరకదు. నాకు పని మనుషులు అవసరం లేదు'' అంది రంగితో ఖచ్చితంగా.

సునీత ముఖంలోని కోపం చూసి బిత్తరపోయి చేసేది లేక గుమ్మం దిగి వెళ్ళిపోయింది రంగి.

★ ★ ★

*(వనితాజ్యోతి, మంత్లీ; ఆగష్టు 1998)*